క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి కడియం విద్యార్థులు



ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించి విద్యార్థులు

కడియం: 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన కడియం హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చాయని హెచ్ఎం టి.సత్యనారాయణ తెలిపారు. 576 మార్కులతో మండల ప్రథమ స్థానం సాధించిన తాండ్ర హేమ, 556 మార్కులు సాధించిన జక్కల భాను ప్రకాష్‌కు ఈ అవకాశం దక్కిందన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను ఉపాధ్యాయ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్, రఫీయుద్దీన్, శరత్, అక్షయ, సువర్ణవేణి అభినందించారన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు

కడియం: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని సిబ్బందిని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో డ్రైన్లలో పూడికతీత, చెత్త, పిచ్చిమొక్కల తొలగింపు, చెత్త, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ మేరకు ప్రతి రోజూ సమీక్ష ఉంటుందన్నారు.

పరిమితికి మించిన జనాభాతో అనర్థాలు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ డీవీ రమణమూర్తి

సీటీఆర్ఐ: ప్రతి దేశానికి జనాభా అనేది అత్యవసరం అని, అయితే పరిమితికి మించితే అనేక నష్టాలు కలుగుతాయని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి అన్నారు. ఆ కళాశాలలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనాభా విపరీతంగా పెరిగితే వారందరికీ వసతులు కల్పించడం ప్రభుత్వానికి భారంగా మారుతుందన్నారు. ఆర్థిక శాస్త్రం శాఖాధిపతి ఎమ్మెస్ ఫణికుమార్, జి.శరత్ బాబు, డాక్టర్ పీవీబీ సంజీవరావు, ఆర్థిక శాఖ అధ్యాపకులు జీవీఎస్ కోటేశ్వరరావు, రాజనీతిశాస్త్ర శాఖ అధ్యక్షులు ఎస్.రమణ పాల్గొన్నారు.

మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం



వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ దినేష్ కుమార్, సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్

సీటీఆర్ఐ: కోటిలింగాలపేట ప్రాంతంలో మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక కోటిలింగాలపేటలోని 10 ఎంఎల్‌టీ పంపింగ్ స్టేషన్‌ను గురువారం ఇన్‌చార్జి జిల్లా జాయింట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్, ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధితో కలిసి ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పైనుంచి వచ్చే వర్షం నీరు కిందకు పోయే మార్గం లేక ఇక్కడే నిల్వ ఉండిపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. 2014లో ప్రస్తుతం ఉన్న పంపింగ్ స్కీమ్‌ను అప్పటి ప్రభుత్వం పుష్కరాల సమయంలో నిర్మించిందన్నారు. ఈ ప్రాంతానికి వచ్చే వర్షపు నీటిని, రెగ్యులర్‌గా వచ్చే నీటిని వేర్వేరుగా కిందకు పంపించేందుకు రెండు పంపింగ్ స్కీములను కట్టాలని, అందుకు అవసరమైతే పేపర్ మిల్లు సహకారాన్ని కూడా తీసుకోవాలన్నారు.

సినిమాలు

శ్యామల :	భారతీయుడు 2
సూర్యమినీ :	కిల్
సూర్యప్యాలెస్ :	భారతీయుడు 2
స్వామి :	మహారాజ
శివజ్యోతి :	ఓఎంజీ (ఓమంచి ఘోస్ట్)
అనుశ్రీ :	సారంగదరియా(మార్నింగ్ షో), మనమే (3 షోలు)
రాజా :	కల్కి 2898ఏడీ
ఊర్వశి :	భారతీయుడు 2
రంభ :	14
మేనక :	బాక్
అప్సర :	కల్కి 2898 ఏడీ
కుమారి :	రాజు యాదవ్
అశోక :	కల్కి 2898 ఏడీ
నామవరం	
వీఎస్ మహల్ :	భారతీయుడు 2
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	కల్కి 2898 ఏడీ, భారతీయుడు 2
కడియం	
వెంకటసూర్య :	భారతీయుడు 2

సిక్స్ కాదు.. అవుట్

- సూపర్ సిక్స్ పథకాలలో ఒకదానికి మెలిక
- తల్లికి వందనంపై జీవో జారీ
- ఒక విద్యార్థికే ఇస్తామంటూ ప్రకటన
- ఎన్నికల హామీకి కూటమి ప్రభుత్వం తూట్లు



రాజమహేంద్రవరంలోని పాఠశాల

కంబాలచెరువు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారు. దానిలో తల్లికి వందనం ఒకటి. మాజీ ముఖ్యమంత్రి జగన్ అమలు చేసిన అమ్మ ఒడి పథకానికి పేరు మార్చి దీన్ని ప్రవేశపెట్టారు. ఎంత మంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందజేస్తామని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఎన్నికలలో విజయం సాధించి అధికారం చేపట్టిన తర్వాత మాట మార్చారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బుధవారం జీఓ నెంబరు 29 జారీ చేసింది. దానిలో ఈ పథకం కింద ఒక్కో తల్లికి రూ.15 వేలు మాత్రమే చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు. గతంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పి, ఇప్పుడు కేవలం ఒకరికే అని జీవో జారీ చేయడంపై విద్యార్థుల తల్లుల ఆందోళన చెందుతున్నారు.

ఏం చేయాలో..

ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ చదువుకునే పిల్లలకు 'తల్లికి వందనం' పథకం పేరుతో ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున వారి తల్లుల బ్యాంకు అకౌంట్లలో జమ చేయాలి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వారి అభ్యర్థులు ఎన్నికల సమయంలో ఊకదంపుడు ప్రచారాలతో హోరెత్తించారు. ఆ హామీలను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు ఇప్పుడు ఏం చేయాలో తెలియడం లేదు.

హామీ అమలు చేయాలి

చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇద్దరు పిల్లలున్నా, ముగ్గురు పిల్లలున్నా పథకాన్ని వర్తింపచేయాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు. గత జగన్ ప్రభుత్వం జూన్‌లోనే అమ్మఒడి పథకాన్ని అమలు చేసేదన్నారు. గతేడాది జూన్ 28న తల్లుల ఖాతాల్లో సొమ్ములు జమయ్యాయని, కానీ కూటమి ప్రభుత్వం పాఠశాలలు తెరిచి నెల కావస్తున్నా నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

> **జగన్ హయాంలో..**
>
> మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమ్మ ఒడి పథకం సక్రమంగా అమలు జరిగింది. ఏటా రూ.15 వేలు చొప్పున నిధులు తల్లుల బ్యాంకు ఖాతాలలో జమ అయ్యాయి. ఇచ్చిన హామీ మేరకు నిబంధనలను అనుసరించి అర్హులందరికీ పథకాన్ని వర్తింజేశారు.

> **హామీని అమలు చేయాలి**
>
> 
>
> ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నా.. వారందరికీ తల్లికి వందనం పథకంలో రూ.15 వేలు చొప్పున అందజేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, కూటమి నాయకులు ప్రచారం చేశారు. ప్రస్తుతం తల్లికి వందనం మార్గదర్శకాలు చూస్తే ఒక్కరికే ఇచ్చేలా కనిపిస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.
>
> – కాకుర్తి మురళి, మాజీ చైర్మన్, పేరెంట్స్ కమిటీ, శాటిలైట్ సిటీ హైస్కూల్

డివిజన్ పరిధిలో..

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ఒకటి నుంచి పదో తరగతి వరకు మొత్తం 213 స్కూళ్లు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లు 84, ప్రైవేట్ స్కూళ్లు 129 ఉన్నాయి. దాదాపు 55,821 మంది విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. వీరిలో 13,821 మంది ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ స్కూళ్లలో, 42 వేల మంది ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులందరికీ అమ్మ ఒడి పథకం అందించింది.

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో కడియం,రూరల్ మండలాల్లో 110 ప్రభుత్వ పాఠశాలలు, 96 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 15, 603 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 30,181 మంది విద్యార్థులు చదువుతున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు

కడియం: మండలంలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కడియం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారానికి అనుసరిస్తున్న చర్యలపై ఆరా తీశారు. అలాగే గ్రామంలో కనీస అవసరాలకు ఎటువంటి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పంతం గణపతి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కార్యాచరణ చేపట్టినట్టు ఏపీఈపీడీఈసెల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఉమ్మడి జిల్లాలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎక్కువగా అంతరాయం కలుగుతున్న ప్రాంతాలను గుర్తించి, చర్యలు చేపట్టాలన్నారు.

ఉత్సాహంగా స్కూల్ ఎన్నికలు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కవలగొయ్యిలోని ది ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో గురువారం జరిగిన ఎన్నికలలో విద్యార్థులు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ పాఠశాల నాయకులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎన్నికలపై అవగాహన కల్పించారు. పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి, చైర్‌పర్సన్ విజయ యేలేటి, సీఈవో మహశ్వి యేలేటి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, డీన్ హర్షిణి పాల్గొన్నారు.

వేద పాఠశాల సందర్శన

ప్రకాశం నగర్: వేదంతో పాటు యోగం సంస్కృతీ సంస్కారాలను వృద్ధి చేస్తుందని యోగా గురువు పతాంజలి శ్రీనివాస్ అన్నారు. స్థానిక కృష్ణ యజుర్వేద స్మార్త పాఠశాలలో వేద పాఠశాల, యోగా శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. యోగ విద్యను అభ్యసిస్తున్న వేద పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. యోగా సాధనలో మెళకువలను తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు, శిక్షకులు మాధవ్ రాంబాబుకు అభినందనలు తెలిపారు.

కొత్తగా డయేరియా కేసులు లేవు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో కొత్తగా డయేరియా కేసులు నమోదు కాలేదని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఏవీకే చైతన్య గురువారం తెలిపారు. పది రోజులుగా లంకూరులో 16 డయేరియా అనుమానిత కేసులు నమోదయ్యాయని, వారిలో 14 మంది చికిత్స అనంతరం డిస్చార్జ్ అయ్యారన్నారు. భేదంపూడి జగన్నాథానికి అదుపులోకి వచ్చిందని, మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా బుధవారం మృతి చెందాడన్నారు. అతడికి డయేరియా తగ్గిందని, డయాబెటిస్ ఉండటంతో వేరే ఆరోగ్య సమస్యలు తలెత్తాయన్నారు. మరో బాధితుడు పెంటా సుబ్బారావును వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు.

కోలాహలంగా ఆర్యాపురం బ్యాంక్ నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నామినేషన్లు అందజేస్తున్న కూటమి నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ పాలక వర్గ ఎన్నికలకు గురువారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 20వ తేదీన జరగనున్న ఎన్నికలకు పలువురు తమ నామినేషన్లను ఎన్నికల అధికారి కృష్ణకాంత్‌కు అందజేశారు. వైఎస్సార్ సీపీ బలపరిచిన బ్యాంక్ పాలకవర్గ చైర్మన్ అభ్యర్థిగా నందెపు శ్రీనివాస్, ఇతర డైరెక్టర్ల పదవులకు సభ్యులతో కలసి నామినేషన్ పత్రాలను అందజేశారు. నందెపు శ్రీనివాస్, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ గతంలో పాలకవర్గంగా పనిచేసిన చల్లా శంకర్రావు ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకును భ్రష్టు పట్టించారని, అన్ని విధాలుగా అవినీతి మయం చేశారన్నారు. తమ ప్యానల్‌ను గెలిపించడం ద్వారా ఆర్యాపురం బ్యాంకు ప్రతిష్ఠను, ప్రయోజనాలను కాపాడేందుకు ఖాతాదారులు సహకరించాలని కోరారు. ఈ నెల 20వ తేదీన ఎస్‌కేవీటీ స్కూల్లో జరిగే ఎన్నికల్లో ఖాతాదారులందరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీరి బెల్ట్‌లో డైరెక్టర్లుగా పులవర్తి లక్ష్మణస్వామి, దూడల త్రినాథ్, నందూరి సుబ్బారావు, డాక్టర్ లంక సత్యనారాయణ, నందం కుమార్ రాజా, కస్సే రాజేష్, ఆకుల శ్రీనివాస్ ఉన్నారు. సీపీఐ నుంచి కూండ్రపు రాంబాబు, కాంగ్రెస్ నుంచి కొవ్వూరి శ్రీనివాస్‌కు అవకాశం కల్పించారు. కార్యక్రమంలో జాంపేట బ్యాంకు చైర్మన్ బొమ్మన జయకుమార్, వాకచర్ల కృష్ణ, మజ్జి అప్పారావు, వడ్డి మురళీ, మజ్జి నూకతర్నం, ఒంటెద్దు సూరిబాబు తదితరులు ఉన్నారు.

కూటమి నాయకుల నామినేషన్

ఎన్డీఏ కూటమి బలపర్చిన చైర్మన్ అభ్యర్థి చల్లా శంకరరావు, తన బెల్ట్ 12 మంది సభ్యులతో నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంకు ఖాతాదారుల ప్రయోజనాలు, ఆస్తుల పరిరక్షణకు కృషి చేసిన చల్లా శంకరరావును చైర్మన్‌గా గెలిపించాలని కోరారు. చైర్మన్ అభ్యర్థిగా చల్లా శంకరరావు, డెరైక్టర్లుగా బుద్ధిగ రవి, పెద్దకాపు, వై.రంగ బాబు, పిల్లి శ్యామ్‌కుమార్, పోలాకి పరమేష్, యర్రమోతు ధర్మరాజు, యాళ్ల వెంకట్రావు, పడాల శ్రీనివాస్, కప్పల ప్రకాష్, నీలపాల సూర్య సత్యనారాయణ, సింగంపల్లి వెంకట రామకృష్ణ నామినేషన్లు దాఖలు చేసారు. బ్యాంక్‌లోని 79,570 మంది సభ్యులు ఈ ఎన్నికల్లో ఓటు వేయనున్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పీటీఎస్ఎఫ్ కృషి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: అందరూ చదవాలి.. అందరూ ఎదగాలి అనే ధ్యేయంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పేరెంట్స్ టీచర్స్ అండ్ స్టూడెంట్స్ యునైటెడ్ ఫెడరేషన్ (పీటీఎస్ఎఫ్) కృషి చేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కొల్లపు వేణు (రాజా) తెలిపారు. కంబాల చెరువు హైటెక్ బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్యామలా బిల్డింగ్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు విద్య అందితేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పేరెంట్స్, టీచర్స్, విద్యార్థులలో ఎవరికి ఏ సమస్య వచ్చినా తాము అందుబాటులో ఉండి పరిష్కారిస్తామన్నారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. బద్దే జార్జి ఆంటోనీ, నక్కా వెంకటరత్నం రాజు, దారా ఏసురత్నం, కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 7 నుంచి 10 గంటల వరకూ తాడితోట ఇండస్ట్రియల్ కాలనీ, ఇన్నీసుపేట, స్టేడియం రోడ్డు, టి.నగర్, పేపర్ మిల్లు గేట్ ఎదుట, శ్రీరామ్ నగర్, బీవీఎం స్కూల్, లలితా నగర్ ప్రాంతాలలో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ సావిత్రి నగర్ , రామకృష్ణ నగర్, ఆదర్శ్ నగర్, పార్కు ఏరియా, కార్తికేయ నగర్, చైతన్య నగర్, నాగిరెడ్డి నగర్, బాలాజీ పేట, గాదాలమ్మ నగర్, కొత్తపేట, మంగళవారపు పేట, భారత్ బొమ్మలు రోడ్డు రోడ్డు, ట్రైనింగ్ కాలేజీ, నాగుల చెరువు బజార్, కొబ్బరి కాయల మార్కెట్, నెహ్రూ జంక్షన్, సీవీఎమ్ మార్కెట్, నేతాజీ స్కూల్ సెంటర్, భావనా రుషి గుడి ఏరియా తదితర ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కృష్ణానగర్, కోర్లంపేట, ఆర్యాపురం, తుమ్మలోవ, కోటిలింగాలపేట ప్రాంతాలలో సరఫరా ఉండదు.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ బాబా నగర్, ఏవీ అప్పారావు రోడ్డు, వెంకట రామయ్య నగర్, గోపాల్ నగర్ పుంత, నాగమ్మ తల్లి గుడి వీధి, డీవీబీ రాజు అపార్ట్‌మెంట్ ఏరియా, నారాయణపురం, భాష్యం స్కూల్, గెయిల్ ఆఫీస్ వెనుక ప్రాంతం, నారాయణపురం ప్రాంతాలలో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పీఅండ్‌టీ కాలనీ, 5వ నంబర్ బస్టాండ్, కోరుకొండ రోడ్డు, రాజా థియేటర్, క్వారీ సెంటర్ ఏరియా, టీవీ రోడ్డు ఏరియా, కొంతమూరు ఏరియా, భవానీపురం ఏరియా, రామదాస్ పేట ఏరియా, పనసచెట్టు సెంటర్, సంజీవ్‌నగర్‌లో విద్యుత్ ఉండదు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న రైల్వే ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ రాజమహేంద్రవరం శాఖ ఓపెన్ లైన్స్, మెకానికల్ బ్రాంచి సెక్రటరీలు ఎస్ఎస్ చంద్రమౌళి, వి.త్రినాథ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ సెక్రటరీ ఆమంచి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు గురువారం రైల్వే స్టేషన్ ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

అధికారుల అదుపులో భారీ వాహనాలు

మధురపూడి: బిల్లులు లేకుండా క్వారీ మెటల్‌ను తరలిస్తున్న తొమ్మిది భారీ వాహనాలను అధికారులు అదుపులోకి తీసుకుని, కోరుకొండ తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. గోకవరం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న వీటిని గురువారం సాయంత్రం బూరుగుపూడి జంక్షన్‌లో పట్టుకున్నారు. వీటికి సంబంధించిన అనుమతులను మైనింగ్ అధికారులు ధ్రువీకరించాల్సి ఉంది. దాని ఆధారంగా కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు.

మనుషుల అక్రమ రవాణాను అరికడదాం



కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది, ప్రజ్వల సంస్థ ప్రతినిధులు

రాజానగరం: మనుషుల అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ టి.నాగమణి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాపై గురువారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అక్రమ రవాణాకు గురయ్యే వారిలో అత్యధికులు అమ్మాయిలేనన్నారు. ఉద్యోగం, సినిమా అవకాశాలు తదితర వాటిని ఎరగా చూపి అమ్మాయిలను విదేశాలకు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మహిళలు చైతన్యవంతులు కావాలన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా తమ సంస్థ 28 ఏళ్లుగా పోరాటం చేస్తోందన్నారు. ఐసీడీఎస్, పోలీస్, విద్య న్యాయ శాఖల సహకారంతో ఇప్పటి వరకు 28,200 మంది మహిళలను కాపాడి, వారికి పునరావాసం కల్పించామన్నారు. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూపులను ఏర్పాటు చేయడం ద్వారా అందరు అప్రమత్తంగా ఉంటారన్నారు. ఇలాంటి సంఘటనలపై 1930 అనే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం మనుషుల అక్రమ రవాణాపై లఘు చిత్రాల ద్వారా అవగాహన కలిగించారు.

భార్యపై భర్త దాడి

కంబాలచెరువు: భార్యపై భర్త దాడి చేసిన సంఘటన స్థానిక పీ అండ్ టీ కాలనీలో గురువారం జరిగింది. ఎం.శివ తన భార్య రేవతితో తరచూ గొడవపడుతుంటాడు. ఈ నేపథ్యంలో మద్యం తాగి వచ్చిన శివతో రేవతి గొడవపడింది. దీంతో అక్కడే ఉన్న సుత్తితో రేవతి తలపై బాదాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దౌర్జన్యం

శ్రీరాంపురానికి చెందిన లంకా వెంకటేశ్వరరావుపై ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు దౌర్జన్యం చేసి, అతడి వద్ద ఉన్న రూ.500 లాక్కెళ్లారు. వెంకటేశ్వరరావు కోరుకొండ మార్కెట్ యార్డ్ వద్ద పండ్లు కొనుగోలు చేసుకుని కంబాల చెరువు వద్ద అమ్ముతుంటాడు. అతను తన పని నిమిత్తం వెళ్తుండగా ముగ్గురు వ్యక్తులు వచ్చి డబ్బులు ఇవ్వమని అడిగారు. అతడు తన వద్ద లేవని చెప్పడంతో దౌర్జన్యంగా దాడి చేసి జేబులోని సొమ్ములు లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదుపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

ఆవ రోడ్డులోని రైతు నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న బాలిక అదృశ్యంపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తన కుమార్తె కనిపించడం లేదని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

సీతానగరం: సీతానగరానికి చెందిన బాలిక కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు. గురువారం తెల్లవారుజామున గమనించగా తన కుమార్తె కనిపించలేదని, బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా కనిపించలేదని తల్లి ఫిర్యాదు చేసిందన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



పాడి రైతులకు మందులు అందిస్తున్న సర్పంచ్ నాగవేణి కుమారి

బిక్కవోలు: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని మండపేట పశు వైద్యుడు వీజీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. గురువారం ఆరికరేవులలో రాష్ట్ర పశు సంవర్ధక శిక్షణ కేంద్రం మండపేట ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పశువుల వివిధ వ్యాధులకు ఉచితంగా చికిత్స చేశారు. అనంతరం డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ పాడి రైతులు పశు సంరక్షణపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులకు సరైన సమయంలో గర్భధారణ చేయించాలన్నారు. పాల ఉత్పత్తి పెరగడానికి తగు సూచనలు ఇచ్చారు. అనంతరం సర్పంచ్ రెడ్డి నాగవేణి కుమారి ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెళ్లూరు పశు వైద్యులు గొలి వీర్రాజు, కొర్ల వినాయకరావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రెడ్డి శ్రీనివాస్, కొర్ల నాగేశ్వరరావు, మహిపాల స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.